క్లుప్తంగా

పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత



క్రీడా పరికరాలు అందజేస్తున్న దాత

బిక్కవోలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పారిశ్రామిక వేత్త గుణ్ణం చంద్రమౌళి సుమారు రూ.30 వేల విలువ గల క్రీడా పరికరాలు బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం వీర ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా పరికరాలు బహూకరించిన దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ సంఘ కార్యదర్శి యార్లగడ్డ బంగార్రాజు, అనపర్తి జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి టీవీవీఎస్ రాఘవరెడ్డి, స్థానిక యువ పారిశ్రామిక వేత్త పాలచర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

గాడాలలో భారీ సమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. విశేష పూజ కార్యక్రమం, కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనకు గాడాల, పాలచర్ల, నిడిగట్ల, మధురపూడి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కోడి పుంజుల చోరీపై కేసు నమోదు

బిక్కవోలు: కోడిపుంజుల చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన కొమరపు ఆనందరావు ఇంటి వద్ద పెంచుకుంటున్న రెండు కోళ్లను ఈ నెల 14వ తేదీన గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో విచారణ చేయగా చుట్టు పక్కల గ్రామాల్లో సైతం చోరీలు జరిగినట్లు గుర్తించామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహాలక్ష్మి అష్టక పారాయణ జ్ఞానయజ్ఞం

పెదపూడి: అనపర్తిలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దైవజ్ఞ రెడ్డీ సురేష్‌శర్మ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం మహాలక్ష్మి అష్టక పారాయణ జ్ఞానయజ్ఞం వైభవంగా ప్రారంభించామని ఆ సమితి కార్యదర్శి సతీష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం మార్గశిర పౌర్ణమి బాలా త్రిపుర సుందరి అమ్మవారి జన్మ నక్షత్రం కావడంతో సుమారు 3వేల మంది వాట్సాఫ్ గ్రూపు సభ్యులతో ఇంటింటా మహాలక్ష్మి అష్టక పారాయణ జ్ఞానయజ్ఞం చేపట్టారన్నారు.

నేడు చంద్రశేఖరస్వామికి అభిషేకాలు



చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. మార్గశిర మాసం సోమవారంతో పాటు ఆరుద్ర నక్షత్రం కలవడం అత్యంత విశేషమైన రోజని ఆయన అన్నారు. అదేవిధంగా ధనుర్మాసం ప్రారంభమవుతున్న రోజు కూడా కావడం విశేషమన్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకు అభిషేకాలు ప్రారంభం అవుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. రంగంపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మార్గశిర మాస బహుళ పాడ్యమి, ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు ఎం. నాగేంద్రకుమార్ తెలిపారు. తెల్లవారు జామున మూడు గంటలకు మంగళ వాయిద్యాల నడుమ తీర్థపు బిందెతో స్వామివారి పూజలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం 108 కుండల నీళ్లతో శతాధిక ఘటాభిషేకం, ఆర్ద్ర నక్షత్ర అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

త్వరలో ప్రీ పెయిడ్ షాక్‌లు

- రీచార్జ్ చేస్తేనే విద్యుత్ సరఫరా
- వినియోగదార్లను భయపెడుతున్న స్మార్ట్ మీటర్లు
- వద్దు వద్దు అంటున్న జనం

రాజానగరం: క్రమం తప్పకుండా ప్రతి నెలా వస్తున్న 'కరెంటు' బిల్లులు ఇప్పటికే చాలామంది వినియోగదార్లకు 'కరెన్సీ' షాక్ కొడుతున్నాయి. ఈ బిల్లుల మోతను ఏవిధంగా తగ్గించుకోవాలా .. అని వినియోగదారులు ఆలోచిస్తుంటే పాలకులు మాత్రం వినియోగదారుల నుంచి పైకాన్ని మరింత ఎక్కువగా ఎలా పిండాలనే ఆలోచనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ రీడింగ్ మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీటర్లను బిగిస్తారనే ప్రచారం వినియోగదార్లను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ విధానంలో సెల్‌ఫోన్ల మాదిరిగా ముందుగానే రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుందని, రీచార్జ్ అమౌంట్ బ్యాలెన్స్ అయిపోతే విద్యుత్ సరఫరా ఆటోమెటిక్‌గా ఆగిపోతుందనడంతో స్మార్ట్ మీటర్లు వద్దు బాబోయ్ వద్దు అంటున్నారు.

నాడు వ్యతిరేకించారు – నేడు సమర్థిస్తున్నారు

కొన్ని నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోని పార్టీలన్నీ ఎన్నికలకు ముందు ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టుగా జగన్ సర్కారు నడుస్తోందని, ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయిందంటూ దుమ్మెత్తి పోశారు. ఈ విధానం ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడానికేగానీ ప్రజలకు ఉపయోగపడదని, సామాన్యులపై ఇది మరింత ఆర్థిక భారాన్ని మోపుతుందని ప్రచారం చేశారు. అయితే ఎన్నికల తరువాత ఆ విధంగా విమర్శించిన పార్టీలే అధికారంలోకి రావడంతో స్మార్ట్ మీటర్ విధానంపై ప్రస్తుతం వారు నోరు మెదపడం లేదు. మౌనం అంగీకారమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.



స్మార్ట్ మీటరు

6,750 సర్వీసులున్నాయి

ఇప్పటికే కేటగిరి 2 పరిధిలోకి వచ్చే ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార దుకాణాలకు, వీధి దీపాలకు స్మార్ట్ మీటర్లను బిగించడం ప్రారంభించారు. ఈ విధంగా చూస్తే నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో కేటగిరి 2లోకి వచ్చేవి 6,750 సర్వీసుల వరకు ఉన్నాయి. వీటిలో ఇంతవరకు 42 సర్వీసులకు మాత్రమే స్మార్ట్ మీటర్లను బిగించారు. మిగిలిన సర్వీసులకు కూడా ఈ విధానం అమలు చేసే అవకాశాలున్నా



ప్రస్తుతం ఉన్న విద్యుత్ రీడింగ్ మీటరు

ప్రస్తుతం ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో తొందరపడకుండా నెమ్మదిగా అడుగులు వేస్తున్నారు.

ప్రస్తుతం కేటగిరీ–2కి మాత్రమే వర్తింపు

విద్యుత్ వినియోగానికి సంబంధించిన బిల్లులను కేటగిరీల వారీగా విభజించి, యూనిట్ శ్లాబ్‌ల ప్రకారం చార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న కేటగిరీలను పరిశీలిస్తే.. కేటగిరి –1లోకి డొమెస్టిక్ కనెక్షన్లు, 2లోకి కమర్షియల్ అండ్ అదర్స్, 3లోకి పరిశ్రమలు, 4లోకి ఇనిస్టిట్యూషన్స్, 5లోకి వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు వస్తున్నాయి. వీటిలో ప్రస్తుతం స్మార్ట్ మీటర్స్ విధానాన్ని కేటగిరి 2లోకి వచ్చే కమర్షియల్ అండ్ అదర్స్‌కి మాత్రమే అమలు చేస్తున్నారు.

శ్లాబ్‌ల విధానం అమలులో ఉంటుందా?

ప్రస్తుతం విద్యుత్ వాడకానికి చెల్లించే బిల్లులు యూనిట్లు, కేటగిరీల వారీగా శ్లాబ్ విధానంలో ఉంటున్నాయి. గుడికి, బడికి, వ్యాపార, వాణిజ్యాలకు, పరిశ్రమలకు, గృహాలకు .. ఇలా కేటగిరీల విధానం అమలు జరుగుతోంది. బిల్లు ఇచ్చిన 15 రోజులలో ఆ బిల్లు మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది. ఒక్కోసారి రెండో నెల రీడింగ్ తీసే సమయానికి బిల్లు చెల్లించకపోతే ఫైన్‌తోపాటు బకాయి నెల చార్జ్‌తో కలిపి బిల్లు వస్తుంది. అయితే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రవేశపెట్టనున్న స్మార్ట్ మీటర్ల విధానంలో ఇందుకు అవకాశం ఉండకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రీచార్జ్ చేసిన సొమ్ము ఉన్నంతవరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, ఆ సొమ్ము ఖర్చయిపోయిన (విద్యుత్ వాడకం ద్వారా) వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోతుందంటున్నారు. అంతేకాక ప్రస్తుత ఉన్న యూనిట్లు, కేటగిరీ, శ్లాబ్ విధానం కొనసాగుతుందా?, లేక కొత్త విధానాన్ని తీసుకువస్తారా? అనే సందేహాలు కూడా వెలువడుతున్నాయి. దశలవారీగా ప్రీ పెయిడ్ విధానాన్ని అమలు చేస్తారంటున్నారు. ప్రస్తుతం వాడుతున్న విద్యుత్‌కి యూనిట్లు, శ్లాబ్‌ల ప్రకారమే బిల్లులు వసూలు చేస్తున్నారు.

రీచార్జ్ విధానం దశల వారీగా అమలులోకి వస్తుంది

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార దుకాణాలు, స్మార్ట్ మీటర్లు అమర్చిన చోట నెలాఖరుకే ఆటోమెటిక్‌గా సెల్‌ఫోన్‌కి కరెంటు బిల్లు వచ్చేస్తుంది. దానిని నిర్ణీత గడువులోగా వినియోగదారుడు చెల్లించవచ్చు. ఇప్పటికే ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లలో సిమ్‌లు ఇన్‌స్టాల్ చేసే ఉంటాయి. అయితే వాటిని రీచార్జ్ చేసుకునే సదుపాయం ప్రస్తుతానికి లేదుగానీ, దశలవారీగా రావొచ్చు.

– సుధాకర్, ఏఈ, విద్యుత్ సబ్‌స్టేషన్, రాజానగరం

స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలి

విద్యుత్ వాడకంలో స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రస్తుతం రీడింగ్ తీశాక ఆ బిల్లును 15 రోజులలో వినియోగదారుడు చెల్లిస్తున్నాడు. దీనివలన పేదలు, మధ్యతరగతి వారికి పెద్దగా ఇబ్బంది ఉండటం లేదు. స్మార్ట్ మీటర్ విధానం అమలులోకి వస్తే ముందుగా పెట్టుబడి పెట్టి (రీచార్జ్ చేసుకోవడం) విద్యుత్‌ని కొనుగోలు చేసుకోవడం ఈ రెండు కేటగిరీల వారికి కష్టతరమవుతుంది.

– అనదాన సాయిరామ్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, ముక్కినాడ

కృష్ణంరాజు సేవలు అభినందనీయం



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: వైఎస్సార్ సీపీ మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు చేస్తున్న సేవలు అభినంద నీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఆదివారం కృష్ణంరాజు ఇంటివద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగించడంతో పాటు ప్రతి ఏడాది విద్యార్థులకు దుస్తులు అందిచడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పాస్టర్లు పుష్పరాజు, చక్రవర్తి, అరుణ్‌కుమార్, వరప్రసాద్, అనంద్‌విక్టర్, జాన్‌పాల్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పావులూరి సీతారత్నం పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



అనపర్తి అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: అనపర్తి అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని దుర్గమ్మ వారికి మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తును సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ పడాల సత్తిరెడ్డి, రాజు గురుస్వామి ఆధ్వర్యంలో పురోహితులు వరిసలేరు రాందేవ్ శర్మ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. సుమారు 400 మంది ముత్తయిదువలు పాల్గొని అమ్మవారి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు పడాల వేణు, తుమ్మ సత్తిబాబు, మండ నాగార్జునరెడ్డి, పడాల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి క్రిస్మస్ నవదిన ప్రార్థనలు

మధురపూడి: క్రిస్మస్ వేడుకల సందర్భంగా సోమవారం నుంచి నవదిన ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని రెవరెండ్ ఫాదర్ మాణిక్యం తెలిపారు. మండల కేంద్రమైన కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫాదర్ మాణిక్యం వాక్య సందేశాన్నిచ్చారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు జన్మ దినోత్సవానికి క్రైస్తవులు సిద్ధం కావాలన్నారు.

సీపీఎం నగర కార్యదర్శిగా రామకృష్ణ

ప్రకాశంనగర్(రాజమహేంద్రవరం): సీపీఎం నగర నూతన కార్యదర్శిగా కర్రి రామకృష్ణ నియమితులయ్యారు. ఆదివారం సీపీఎం నగర మహాసభ స్థానిక తాడితోటలోని శ్రీరాములు కల్యాణ మండపంలో జరిగింది. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన 11 తీర్మానాలను ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 13 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నికైంది. నగర కార్యదర్శిగా కర్రి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా బి.పవన్, పూర్ణిమ రాజు, జరీనా, సరోజ్, నగర కమిటీ సభ్యులుగా పి.మురళీ కృష్ణ, ఎస్.వెంకటేశ్వరావు ఎన్నికయ్యారు.



ఊలపల్లిలో పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రంగంపేటలో పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు



రాజానగరంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న సేవా సమితి అధ్యక్షుడు నానబ్బులు తదితరులు

పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడు

బిక్కవోలు: అమరజీవి పొట్టి శ్రీరాముల జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం కె.అమ్మిరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని ఊలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మార్పణ దినం నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమ్మిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 56 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేశారన్నారు. ఉపాధ్యాయులు కె.విజయగీత, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని గ్రామ మాజీ ఉప సర్పంచ్ పోతుల వీర సుందరరావు అన్నారు. ఆదివారం అమరజీవి వర్ధంతి సందర్భంగా రంగంపేట గ్రామంలోని స్థానిక ఆర్య, వైశ్య కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ప్రాతిపదికగా ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, ఎం.సాయిరాం, మండవిల్లి గుప్తా, రాంబాబు, గిరిబాబు, బాబి, రాజా, ఆర్య, వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళి

రాజానగరం: ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని రాజానగరంలోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గ్రంధి నానబ్బులు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దవులూరి గిరిబాబు, మండల సెక్రటరీ గ్రంధి రాజా, ఉపాధ్యక్షుడు ముత్తా రామకృష్ణ, బలభద్ర ప్రసాద్, కంకటాల మహేష్, కంకటాల మూర్తి, ఏడుకొండలు, గ్రంధి సత్తిబాబు, రాంబాబు, పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో సాగిన బైక్ ర్యాలీ

ఆర్యవైశ్యుల బైక్ ర్యాలీ

మండలంలోని రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్ల కార్డులు ధరించి మోటారు సైకిల్‌పై రఘుదేవపురం నుంచి సీతానగరం బస్టాండ్, నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల ఆర్యవైశ్యుల సమావేశంలో సీతానగరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పువ్వాడ కృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను, ఉప్పు సత్యగ్రహంలోను పాల్గొని జైలుపాలయిన సమరయోధుడు శ్రీరాములన్నారు. ఆంధ్రప్రదేశ్ సాధించడానికి తన ప్రాణాలు సైతం ధారబోసిన పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. ముఖ్య అతిథులుగా హాజరైన రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, టీడీపీ నాయకులు పెందుర్తి అభిరామ్‌లను సత్కరించారు.



పెదపూడిలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ తదితరులు

పెదపూడి: రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేసి ప్రాణత్యాగానికి పాల్పడిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాతిపిత మహాత్మ గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.శ్రీనివాసు, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, అనంత, స్థానిక నాయకులు గుణ్ణం రామాంజనేయులు, సత్యనారాయణ, వీర్రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయుడికి క్షీరాభిషేకం



అనపర్తిలో దత్త మాలాధారణ గావించిన భక్తులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గల దత్తాత్రేయ స్వామికి ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ఆదివారం దత్తాత్రేయుని జయంతిని పురస్కరించుకుని అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అన్న సమారధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సబ్బెళ్ల సత్తిరెడ్డి, సబ్బెళ్ల వీర్రాఘవరెడ్డి, సబ్బెళ్ల రాయల్‌రెడ్డి, సత్తి సాయి ప్రదీప్‌రెడ్డి, షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

పెదపూడి: అనపర్తి ఔదంబర దత్తపీఠం ఆర్‌కే గొడౌన్సులో దత్తాత్రేయ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయునికి పాలాభిషేకం, అర్చన, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. దత్త మాలధారణ గావించిన భక్తులు విశేష పూజలు చేశారు. కార్యక్రమానికి హాజరైన సుమారు 5వేల మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దత్త పీఠాధిపతులు మల్లిడి సత్యనారాయణ రెడ్డి, పురోహితులు బాలాజీ, శర్మ, సుబ్బారెడ్డి, ఆదిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.



సాయిబాబా సన్నిధిలో గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

వైభవంగా దత్త జయంతి

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్తజయంతి ఆదివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఇక్కడ కొలువైవున్న దత్తాత్రేయునితోపాటు తొలుత గణపతికి, సరస్వతీమాతకు, సాయిబాబాకు సూర్యారావుపేటకు చెందిన వీరబాబు దంపతులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సాయిభక్త మండలి ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణ చేశారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్న సమారాధన జరిగింది.

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో ఆదివారం దత్తాత్రేయ స్వామివారి జయంతి ఘనంగా జరిగింది. అర్చకులు వేదాంతం రామకృష్ణాచార్యులు మంత్రోచ్ఛరణతో పంచామృతాభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41 మంది సామూహికంగా దత్త స్వామినామ పారాయణ, సిద్ధ మంగళ పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది.



కోరుకొండలో దత్తాత్రేయ జయంతి నిర్వహిస్తున్న భక్తులు



పందలపాకలో దత్తాత్రేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కోటసత్తెమ్మ తిరునాళ్లు ప్రారంభం

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి తిరునాళ్లు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతుల కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఏకాదశ రుద్రాభిషేకాలు, మహాలింగార్చన సూర్య నమస్కారాలు, మహాన్యాస పఠం నిర్వహించారు. ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హోమం చేశారు.

రాజానగరం మండల అధికారుల ఫోన్ నంబర్లు

ఎంపీడీఓ	ఎస్‌జే ఝాన్సీ	96520 77166
తహసీల్దార్	ఎస్.లక్ష్మీలావణ్య	98499 03900
డిప్యూటీ తహసీల్దార్	ఎ.కుమారి	99491 00395
మండల సర్వేయర్	ఇ.అనిత	81794 14568
మండల సివిల్ సప్లయిస్ డీటీ	గొలుగూరి బాపిరాజు	91823 02929
మండల రీసర్వే డీటీ	బి.క్రాంతి	7382 286190
మండల వ్యవసాయాధికారి	ఎస్‌కే ఇమామి ఖాసిం	83310 56550
మండల ఇంజినీర్	సంపత్ కుమార్	98661 35609
విద్యుత్ శాఖ ఇంజినీర్, రాజానగరం	సుధాకర్	94408 12623
విద్యుత్ శాఖ ఇంజినీర్, సంపత్ నగరం	సత్యప్రసాద్	94408 12627
మండల విద్యాశాఖాధికారి- 1	రామన్నదొర	94409 13928
మండల విద్యాశాఖాధికారి- 2	జ్యోతిప్రసాద్	94401 71896
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సీడీపీఓ	టి.నాగమణి	94408 14693
ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఏపీఎం	సునీత	79933 25065
గృహ నిర్మాణ శాఖ డీఈ	ఆర్‌వీ బాబు	70939 30566
గృహనిర్మాణ శాఖ ఏఈ	ఏవి రామారావు	70939 30478
సబ్ రిజిస్ట్రార్, రాజానగరం	వెంకటేశ్వరరావు	70939 21434
పోలీసు శాఖ		
రాజానగరం సీఐ	ఎస్‌పీ వీరయ్య గౌడ్	94407 96585
రాజానగరం ఎస్సై- 1	మనోహర్	94932 06031
ఎస్సై- 2	నాగేశ్వర్	94904 91132
బొమ్మూరు సీఐ	కాశీ విశ్వనాథ్	94407 96533